క్లుప్తంగా

ఘనంగా పోచమ్మ బోనాలు



వర్ధన్నపేట : శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలో విశ్వబ్రాహ్మణ కులస్తులు ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. కుటుంబాలతో పోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి చీర, సారె, తొలి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పుల్లా చారి, కుమారస్వామి, విష్ణు, శ్యామ్, బ్రహ్మం, భక్తులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి



చంద్రకళ (ఫైల్)

రాయపర్తి : కూలీ పనికి వెళ్తూ ప్రమాదవశాత్తు బైక్‌పైనుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని పెర్కవేడులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన అబ్బోజు చంద్రకళ(55) తోపాటు మరో మహిళను గణేశ్‌కుంటతండాకు చెందిన భోజ్యానాయక్ కూలీ పని కోసం తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి చంద్రకళ జారి పడింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను స్థానికులు వర్ధన్నపేట ఆస్పత్రికి 108 వాహనంలో తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

నర్సంపేట : ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన మాలోతు హనుమ(60) ఇటీవల భార్యతో గొడవపడి మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆయన్ను చికిత్స నిమిత్తం తొలుత నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

యువకుడికి గాయాలు

వర్ధన్నపేట : సెల్‌ఫోన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువడుకు ఆర్టీసీ బస్సును ఢీకొని గాయాలపాలైన ఘటన పట్టణ కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. మండలంలోని ఇల్లందకు చెందిన రాపోలు బాలు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో సెలఫోన్ మాట్లాడుతూ బైక్‌పై ప్రయాణిస్తున్న క్రమంలో తన సమీపంలోకి వస్తున్న ఆర్టీసీ బస్సును గమనించకుండా ఢీకొట్టాడు. దీంతో బాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ అధికారులు బాలుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నల్లబెల్లం పట్టివేత

తొర్రూరు రూరల్ : మండలంలోని చింతలపల్లి గ్రామ శివారులోని కొమ్మనపల్లితండాకు చెందిన ఓ వ్యక్తి బైక్‌పై 500కేజీల నల్లబెల్లం తీసుకెళ్తుండగా పట్టుకుని, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తొర్రూరు ఎక్సైజ్ సీఐ అశోక్ తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



తొర్రూరు : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సంక్షేమ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ విజయరత్న మాల అన్నారు. ఆదివారం నవయుగ యూత్ వారి ఆధ్వర్యంలో హరితహార కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం ప్రతి వ్యక్తి మొక్కల పంపకానికి నిరంతరం కృషి చేయాలన్నారు.. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు బానోతు వీరన్ననాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి



గూడూరు : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం చిరస్మరణీయుడని జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ ఖాసీం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ముక్తవరం సత్యనారాయణ, బానోతు లక్ష్మణ్, బెజ్జం రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- అంతర్గత రోడ్లు బురదమయం
- తాగునీటిలో కలుస్తున్న మురుగు



తొగర్రాయిలో తాగునీటిలో కలుస్తున్న మురుగు

దుగ్గొండి : వర్షాకాలం నేపథ్యంలో సుమారు వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. సైడ్‌కాల్వలు పూడిక మట్టితో కూరుకుపోయి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దోమలు ప్రబలి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మంచినీటి గేట్‌వాల్వ్ సంపుల్లోకి మురుగు చేరి తాగునీరు కలుషితం అవుతున్న దుస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోతుండడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లోనూ పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. దుగ్గొండికి వెళ్లే సీసీ రోడ్డు గుంతలమయంగా మారి బురదమయం అయ్యింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం కార్యాలయానికి, ఇళ్లకు రాకపోకలు సాగిస్తున్న అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. సైడ్‌కాల్వలు పూడికతో నిండిపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మహ్మదాపురంలో సైడ్‌కాలవ్లో మురుగునీరు పేరుకుపోయి దోమలు ప్రబలిన పరిస్థితి నెలకొంది. గిర్నిబావిలో ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారం వేస్తుండటంతో కంపు వాసన తట్టుకోలేక పోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొగర్రాయి ఎస్సీ కాలనీలో మంచినీటి గేట్‌వాల్వ్ సంపుల నిండా మురుగు చేరి తాగునీటిలో కలుస్తోండడం జనాన్ని కలవరపరుస్తోంది. నాచినపల్లి పాత ఎస్సీ కాలనీలో రహదారి నిత్యం చెరువులా దర్శనమిస్తోంది. అన్ని గ్రామాల్లోనూ అంతర్గత రోడ్లు బురదయం అయ్యాయి.

అధికారుల నిర్లక్ష్యం

ఏడాదిన్నర క్రితం పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించిన విషయం తెలిసిందే. కాగా ప్రత్యేక అధికారులు మొదట్లో గ్రామాలను పర్యవేక్షించినా కొద్ది రోజులకే ముఖం చాటేశారన్న విమర్శలున్నాయి. కార్యాలయంలోని హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేస్తూ ఇళ్లకు వెళుతున్నారని పలువురు బహిరంగంగానే మండిపడుతున్నారు. గ్రామంలో ఉండి పనులు చేయించాల్సిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ప్రజలు తెలిపారు.



మహ్మదాపురంలో పూడికతో నిండిన సైడ్‌కాల్వ



బురదమయంగా మారిన సీసీ రోడ్డు

యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తాం

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. పల్లెల్లో వరదలతో సైడ్‌కాల్వల్లోకి పూడికమట్టి చేరింది. గ్రామాల్లో పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. యుద్ధప్రాతిపదికన సైడ్‌కాలవ్లోని పూడిక తీయించి శుభ్రం చేయిస్తాం. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపడతాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వారానికోసారి బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం.

– మోడెం శ్రీధర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి

మహాసభలను జయప్రదం చేయండి

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

సంగెం : ఈనెల 30, 31 తేదీల్లో మండల కేంద్రంలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో నూరేళ్ల చరిత్ర కలిగిన పార్టీగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అలుపెరగని పోరాటాలు చేస్తున్నట్టు తెలిపారు. పాలకులు అవలంభిస్తున్న తప్పుడు విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసి సమరశీల పోరాటాల దిశగా నడిపించాలని శ్రేణులకు సూచించారు. ప్రజాసమస్యల పరిష్కార దిశగా భవిష్యత్ కార్యాచరణకు మహాసభలో రూపకల్పన జరగనుందని చెప్పారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆరెల్లి ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా జున్న సాంబయ్య, సభ్యులుగా ఫయాజ్, కల్యాణి, మణెమ్మ, మెట్టుపల్లి స్వామి ఎన్నికయ్యారు.

కూలిన ప్రహరీలు



రాయపర్తి : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గన్నారం గ్రామంలో అబ్బరబోయిన వెంకటయ్య, అబ్బరబోయిన సోమయ్య ఇళ్ల ప్రహరీలు ఆదివారం కూలాయి. ఆ సమయంలో అటుగా ఎవరూ వెళ్లకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వెంకటయ్యను, సోమయ్యను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

- 'ఎస్‌ఆర్‌ఆర్' ప్రతినిధి మధూకర్‌రెడ్డి



బియ్యం, సరుకులు ఇస్తున్న నాయకులు

రాయపర్తి : మండలంలోని పేద, బాధిత కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చేయూత అందిస్తుందని ప్రతినిధి లేతాకుల మధూకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు కుటుంబాలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్వింటా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మధూకర్‌రెడ్డి మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల కేంద్రంలో ఐత యాకన్న తల్లి సోమక్క ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి క్వింటా బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం పెర్కవేడులో గారె పెద్ద కొంరయ్య, పానిశ్‌తండాలో భూక్యా బాలునాయక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు సైతం క్వింటా బియ్యం, సరుకులు అందజేశారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమాల్లో నాయకులు గజవెల్లి ప్రసాద్, గాదె రవీందర్‌రెడ్డి, యూసుఫ్, భూక్య భద్రునాయక్, కంది ప్రభాకర్, సంకినేని ఎల్లస్వామి, పోగులకొండ వేణు తదితరులు పాల్గొన్నారు.

నేడు కేజీబీవీలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

సంగెం : నేడు (సోమవారం) మండల కేంద్రంలోని కేజీబీవీలోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ ప్రవేశాలు కల్పించనున్నట్టు ప్రత్యేక అధికారి (ఎస్ఓ) నీలిమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఈసీలో 25, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 15 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి పూర్తి చేసిన బాలికలు అర్హులని వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన బాలికలు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9492201975లో సంప్రదించాలని కోరారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

ఖిలా వరంగల్ : పేదలు, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా అన్నారు. వరంగల్ శివనగర్‌లోని గణేష్ రాజ్ అధ్యక్షతన ఎల్‌వీఆర్‌నగర్ శాఖ ఆరో మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ బూర్జువా పార్టీలతో అభివృద్ధి ఏమాత్రం జరగదని ఆరోపించారు. అనంతరం ఎల్‌వీఆర్ నగర్ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా చెలుకల రాజు, సహాయ కార్యదర్శిగా ఏనుగు శైలజ, రాజేశ్వరమ్మ, కమిటీ సభ్యులుగా గణేష్‌రాజ్, ఎడ్ల అనసూర్య, కల్పన, ఏసుబాబు, శ్రీను, గంగయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యాకాంబ్రచారి, బద్రి, జన్ను రవి, కుమార్, సదానందం, పద్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పర్వతగిరి : ఇటీవల విద్యుదాఘాతానికి గురై రెండు కాళ్లు, చేయి కోల్పోయి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి చేరిన మండలంలోని బట్టుతండా శివారు ఎన్జీతండాకు చెందిన బట్టు బాలాజీని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు ఆదివారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు వర్తించేలా చొరవ తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

శతాధిక వృద్ధురాలి మృతి



సమ్మక్క (ఫైల్)

ఖిలా వరంగల్ : వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్ దర్గా ప్రాంతానికి చెందిన శతాధిక వృద్ధురాలు బేతి సమ్మక్క (103) ఆదివారం మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు కాగా, 50 మంది మనవళ్లు, మనవరాళ్లతో సంపూర్ణ జీవనాన్ని కొనసాగించిన సమ్మక్క.. ఇటీవల అనారోగ్యం పాలై ఆదివారం ఉదయం కన్నుమూసింది.

ఎంసీపీఐ(యూ) నగర కార్యదర్శిగా సాగర్

ఖిలా వరంగల్ : ఎంసీపీఐ(యూ) వరంగల్ నగర కార్యదర్శిగా మాలోతు సాగర్, సహాయ కార్యదర్శిగా మంచు జగదీశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు వారికి జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ నియామక పత్రాలను ఆదివారం అందజేశారు.

రజకుల అభివృద్ధికి కృషి

హసన్‌పర్తి : రజక కులస్తుల, వృత్తిదారుల అభివృద్ధికి కృషి చేస్తానని రజక సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్యాల భిక్షపతి తెలిపారు. భద్రకాళి దేవస్థాన పాలక మండలి సభ్యులుగా నియమితులైన పాలడుగుల ఆంజనేయులు, ఓరుగంటి పూర్ణచందర్‌తో పాటు రజక సంఘం రిటైర్డ్ ఉద్యోగులు కుమారస్వామి, సారయ్య, సుధాకర్‌ను హసన్‌పర్తి ఆదర్శ రజక సహకార సంఘం ఆధ్వర్యంలో ఎర్రగట్టు గుట్ట వెంకటేశవర స్వామి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా భిక్షపతి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీల్లో ఉన్న రజకులు పోటీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ రజక సహకార సంఘం అధ్యక్షుడు గోపరాజు ఉదయ్ కుమార్, సభ్యులు కుమారస్వామి, ఎల్కరాజు సదానందం, సాంబమూర్తి, గుడికందుల సురేష్, గోపరాజు యాదగిరి, గుడికందుల కనకస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



మాట్లాడుతున్న డాక్టర్ నరేశ్

ఖిలా వరంగల్ : కరీమాబాద్ ఉర్సు దర్గాలో మీ నేస్తం హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు ఆకులపల్లి యాకోబు ఆధ్వర్యంలో సన్‌లైఫ్ ఆస్పత్రి డాక్టర్ అనంతుల అన్వేష్, సూర్య పిల్లల క్రిటికల్ కేర్ ఆస్పత్రి డాక్టర్ జడల హరీష్‌వర్ధన్ నేతృత్వంలో ఉర్సు దర్గా పీఠాధిపతి హజ్రత్ ఉబేద్ బాబా సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి స్థానికుల నుంచి అపూర్వ స్పందన వచ్చిందని ఉబేద్‌బాబా తెలిపారు.

బీజేపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

- జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి



వీరభద్రును పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట/దుగ్గొండి : బీజేపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. దుగ్గొండి మండలంలోని రాజ్యతండాకు చెందిన మాజీ ఉపసర్పంచ్ బానోతు వీరభద్రు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని కార్యాలయంలో వీరభద్రుకు రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ బలపడుతోందని చెప్పారు. ప్రజలందరూ పార్టీని ఆదరిస్తున్నారని తెలిపారు. యువత సత్వరమే రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో విసిగిన ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అనుబంధ ఎస్టీ మోర్చా జిల్లా నాయకుడు బానోతు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి మాట్లాడుతున్న దేవేందర్‌రావు

- కిసాన్ సెల్ అధ్యక్షుడు దేవేందర్‌రావు

పర్వతగిరి : అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మండలంలోని బట్టుతండా, ఎన్జీతండాల్లో పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను ఆదివారం వారు పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టించే లక్ష్యంతో పథకం అమలు చేస్తోందని చెప్పారు. దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. లబ్ధిదారులు నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకుని బిల్లులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సువర్ణ, ఎస్సీ సెల్ మండల నాయకులు మాసాని యాకూబ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు బట్టు గణేశ్, గుగులోతుతండా కమిటీ అధ్యక్షుడు చందునాయక్, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ తిరుపతి



నినాదాలు చేస్తున్న తిరుపతి, నాయకులు

రాయపర్తి : గీత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కార్యాచరణ చేపట్టనున్నట్టు గీత పారిశ్రామిక సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బైరి తిరుపతి తెలిపారు. మండల కేంద్రంలో గీత పారిశ్రామిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గీత కార్మికుల ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర వెనుకబాటుకు గురవుతున్నట్టు తెలిపారు. కార్మిక సంఘాలను బలోపేతం చేయడం ద్వారా కార్మికుల సంక్షేమానికి బాటలు వేస్తామన్నారు. గీత కార్మికుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలని, మోపెడ్ ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర శ్రీనివాస్, కక్కర్ల సారయ్య, దొమ్మరి సంపత్, కుమార్, మధూకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

హసన్‌పర్తి : మండల పరిధిలోని 66వ డివిజన్‌లోని కాకతీయ వెంటేజ్, బీకేఆర్ ఎన్‌క్లేవ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హామీ ఇచ్చారు. కాతీయ వెంటేజ్, బీకేఆర్ ఎన్‌క్లేవ్ కుడా లేఅవుట్ కాలనీలను ఎమ్మెల్యే ఆదివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ వైస్ చైర్మన్ నిమ్మా శేఖర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ బల్సుకూరి శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యుడు పోతరాజు ప్రభాకర్, దేవస్థాన ధర్మకర్త సురేష్, నాయకులు పెద్దమ్మ నర్సింహారాములు, తాళ్ల మధు, కాకతీయ వెంటేజ్, బీకేఆర్ ఎన్‌క్లేవ్‌ల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్



జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

దామెర : హైదరాబాద్–భూపాలపట్నం 163 జాతీయ రహదారిపై ఆదివారం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. మండలంలోని ఉరుగొండ సమీపంలో జాతీయ రహదారిలో గల ఎస్సారెస్పీ కెనాల్‌పై బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. అయితే రాకపోకలు కొనసాగించేందుకు బ్రిడ్జిపై తాత్కాలిక దారి నిర్మించారు. ఈ క్రమంలో డైవర్షన్ రోడ్డుపై లారీ బ్రేక్‌డౌన్ అవడంతో కిలో మీటర్‌మేర వాహనాలు సుమారుగా గంటకు పైగా నిలవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. విషయం తెలుసుకున్న పోలీస్‌లు అక్కడకు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R): 9502950309 (వర్ధన్నపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O): 9963646944